విజృంభిస్తున్న ఒమిక్రాన్ బిఎ 4.6

లండన్ : ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కోవిడ్ కేసుల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తున్న సమయంలో అమెరికాలో మాత్రం ఒమిక్రాన్ కోవిడ్ వేరియంట్‌లో కొత్త సబ్‌వేరియంట్ బిఎ 4.6 అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఈ వేరియంట్ ఇంగ్లండ్‌లోనూ వేతంగా వ్యాప్తి చెందుతున్నట్లు తాజాగా నిర్ధారణ అయింది. ఇంగ్లండ్ హెల్త్ సెక్యూరిటీ ఏజెన్సీ తాజా నివేదిక ప్రకారం ఆగస్టు 14 నుంచి ప్రారంభమైన వారంలో నమోదైన కరోనా కేసుల్లో 3.3 శాతంగా ఉన్న బిఎ 4.6కు కేసులు ప్రస్తుతం 9 శాతానికి చేరుకున్నాయి. అమెరికాలోని ఇటీవల కేసుల్లో బిఎ 4.6 కేసులు 9 శాతం కంటే ఎక్కువ ఉన్నట్లు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ విడుదల చేసిన తాజా సమాచారం ప్రకారం తెలుస్తోంది. ఈ బిఎ 46 అనేది బిఎ4 యొక్క రూపాంతరంగా నిపుణులు చెబుతున్నారు. బిఎ4ను మొదటిసారిగా ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాలో కనుగొన్నారు. ఈ బిఎ 4.6 ఎలా ఉద్భవించిందో ఇప్పటి వరకూ స్పష్టంగా వెల్లడికాకపోయినా... కోవిడ్‌కు కారణమయ్యే రెండు వేరువేరు వేరియంట్లు ఒకే సమయంలో ఒకే వ్యక్తికి సోకినప్పుడు ఈ కొత్త వేరియంట్ ఉద్భవించిందని అంచనా వేస్తున్నారు.

ఇడి దాడుల్లో 91.5 కేజీల బంగారం స్వాధీనం

ముంబయి : రక్ష బులియన్, క్లాసిక్ మార్బ్స్‌కు చెందిన నాలుగు ప్రాంగణాలపై చేసిన దాడుల్లో 91.5 కేజీల బంగారం, 340 కేజీల వెండిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) స్వాధీనం చేసుకుంది. ఈ వీటి విలువ రూ. 47.76 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పరేఖ్ అల్యూమినిక్స్ లిమిటెడ్‌కు వ్యతిరేకంగా నమోదైన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఇడి ఈ సోదాలు నిర్వహించింది. ఈ కంపెనీ రూ. 2,296.58 కోట్ల రుణాన్ని తీసుకుని అక్రమంగా దానిని వివిధ ఇతర కంపెనీలకు తరలించి స్వాహా చేసినట్లు ఇడి ఆరోపిస్తుంది. ఇది రుణాల ప్రయోజనం కాదని, ఇలాంటి లావాదేవీలకు ఎలాంటి ఒప్పందాలు లేవని తెలిపింది. బుధవారం చేసిన సోదాల్లో రక్షా బులియన్ ప్రాంగణాల్లో ప్రైవేట్ లాకర్లను ఇడి గుర్తించింది. ఇలాంటి నిబంధనలు పాటించకుండా వీటిని ఏర్పాటు చేశారని, ప్రాంగణంలో సిసిటివి కెమెరాలను కూడా ఏర్పాటు చేయలేదని ఇడి ప్రకటనలో తెలిపింది. గుర్తించిన 761 లాకర్లలో 91.5 కేజీల బంగారం, 152 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.47.76 కోట్లు ఉంటుందని తెలిపింది.

ఎయిర్ ఇండియా విమానంలో పొగలు

- 145 మందికి త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- భయోత్పాతంతో పరుగులు తీసిన ప్రయాణికులు

మస్కట్ : కానేపట్లో బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానంలో పెద్ద ఎత్తున పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఒమన్ రాజధాని మస్కట్ విమానాశ్రయంలో కొచ్చిన్‌కు వెళ్ళాల్సిన ఎయిర్ ఇండియా విమానంలోని ఒక ఇంజనులో టేకాఫ్‌కు కాస్త ముందుగా మంటలు చెలరేగాయి. దాంతో వెంటనే విమానంలోని 145 మంది ప్రయాణికులను, సిబ్బందిని విమానం నుండి దింపి టెర్మినల్ భవనాలకు తరలించారు. వీరిలో నలుగురు శిశువులు కూడా వున్నారు. ఈ సందర్భంగా ఎవరూ గాయపడలేదని తెలుస్తోంది. ప్రయాణికులందరినీ తీసుకెళ్లడానికి వేరే విమానాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డిజిసిఎ) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ రంగంలో దశాబ్దాల పాటు సేవలందించిన ఎయిర్ ఇండియా సంస్థను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే టాటా గ్రూపునకు కారుచౌకగా అమ్మేసిన సంగతి విదితమే. భారత్‌కి చెందిన మొదటి అంతర్జాతీయ బడ్జెట్ విమానంగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు పేరుంది. ప్రధానంగా పశ్చిమాసియా దేశాలు, ఆగ్నేయాసియా దేశాలకు ఇది ప్రయాణిస్తుంటుంది. దేశంలోని విమానయానరంగం మొత్తం ప్రయివేటు సంస్థలే నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల ప్రమాదాల ఘటనలు కూడా పెరుగుతున్నాయి. రెండు మాసాల క్రితం కాలికట్ నుండి దుబాయ్‌కి వెళ్ళే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో కాలిన వాసన రావడంతో అత్యవసరంగా మాస్కట్‌కి మళ్ళించారు. జులైలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కి సంబంధించి చాలా సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీ నుండి వడోదరకి వెళుతున్న ఇండిగో విమానం ఇంజనులో అసాధారణంగా కుదుపులు రావడంతో ముందు జాగ్రత్తగా జైపూర్‌కి మళ్లించారు. షార్జా నుండి హైదరాబాద్‌కి వెళ్లాల్సిన మరో ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో కరాచికి మళ్ళించారు. ఢిల్లీ నుండి గువహటి వెళ్ళాల్సిన గో ఫస్ట్ విమానం గాల్లో వుంటుండగానే విమానం పై పౌర బీటలు వారడంతో జైపూర్‌కి మళ్ళించారు. రెండు రోజుల్లో ఇలా మూడు సంఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌లైన్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. మరింత మెరుగైన పర్యవేక్షణ వుండేలా చూడాల్సిందిగా కోరారు.

విభజన చట్టంలోని అంశాలు వెంటనే అమల్జేయాలి

- రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన జరిగి 8 ఏళ్లు అయినా ఇప్పటికీ అనేక అంశాలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సివుందని, అయినా మోడీ సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బుధవారం న్యూఢిల్లీలోని ఏపి భవన్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్‌తో కలిసి తమ్మినేని మీడియాతో మాట్లాడారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, నీటీ పారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా, కేంద్ర విద్యా సంస్థలు నెలకొల్పడం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి అంశాలేవీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సమావేశం కూడా కంటితుడుపు చర్యేనన్నారు. రాష్ట్రాల్లోని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమస్యలు పరిష్కరించాలని, చట్టంలో పేర్కొన్న హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.భూస్వామలను, రజాకార్ల దురాగతాలను వ్యతిరేకిస్తూ సాగిన మహోజ్వల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పులిమేందుకు కుట్ర పన్నుతోందని తమ్మినేని అన్నారు. ఇందులో భాగంగానే సెప్టెంబర్ 17ను కేంద్ర ప్రభుత్వం విమోచన దినంగా నిర్వహించాలని నిర్ణయించిందని ఆయన విమర్శించారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కేంద్ర నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముస్లింలు కూడా అనేక మంది పాల్గొన్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ గాథను వివరించేందుకు వీరనారి చాకలి ఐలమ్మ వర్థంతి ఈ నెల 10 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 17న నిజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన రోజున బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. మిర్యాలగూడలో జరిగే ఈ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని, హైదరాబాద్‌లో జరిగే సదస్సులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎ విజయ రాఘవన్ పాల్గొంటారని తెలిపారు.

బిజెపియేతర పక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను ఇడి, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో బెదిరింపులకు గురిచేయడం, దౌర్జన్యాలతో వేధింపులకు గురిచేయడం, లేదా డబ్బు ఎరగా చూపడం వంటి అనేక అప్రజాస్వామిక పద్ధతుల్లో ఆయా రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బిజెపి కుటిలయత్నాలకు పాల్పడుతోందని తమ్మినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ ఇదే తరహాలో ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ కేంద్ర హోంమంత్రే బాహటంగా చెబుతుండటం దుర్మార్గమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజానీకానికి పెను ప్రమాదంగా ముందుకొస్తున్న బిజెపిని ఓడించేందుకే టిఆర్ఎస్‌కు తాము మద్దతు ఇచ్చామని తెలిపారు. అయితే ఈ మద్దతు మునుగోడు ఉప ఎన్నికకే పరిమితమని తెలిపారు.

సుప్రీం కోర్టుపై విశ్వాసం సన్నగిల్లుతోంది

- సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అత్యున్నత న్యాయస్థానంపై విశ్వాసం నెమ్మదిగా సన్నగిల్లుతోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన సుప్రీం ధర్మాసనానికే విన్నవించారు. జకియా జాఫ్రీ, పిఎంఎల్ఎ కేసుల్లో తీర్పులను విమర్శిస్తూ ఆగస్టు 6న సిటిజన్స్ ట్రిబ్యునల్‌లో సుప్రీం కోర్టుపై కపిల్ సిబల్ గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనంలో విచారణ జరుగుతున్న సమయంలో కపిల్ సిబల్ మాట్లాడుతూ "మీరు కూర్చున్న కుర్చీపై మాకు చాలా గౌరవం ఉంది. ఇది బార్ అండ్ బెంచ్ మధ్య విచ్ఛిన్నం కాని వివాహం. కానీ నాలాంటి వ్యక్తిని కలవరపెడుతుంది. న్యాయస్థానంపై విశ్వాసం సన్నగిల్లుతోంది" అని అన్నారు. సిబల్ వ్యాఖ్యలపై జస్టిస్ రస్తోగి స్పందిస్తూ, "మేము ఎప్పుడూ బార్ అండ్ బెంచ్ రథానికి చక్రాలు అని చెబుతాము, అయితే వాస్తవం ఏమిటంటే ఇవి రెండు చక్రాలు. ఒక చక్రం ఎక్కడికి వెళ్తుందో, మరొక చక్రం ఎక్కడికి వెళ్తుందో దేవుడికి తెలుసు. మనమందరం ఈ సంస్థ గురించి ఆందోళన చెందుతున్నాము. సామాన్య ప్రజల విశ్వాసం సన్నగిల్లకుండా ఉండే దేశంలో మనం ఎలా నిలదొక్కుకోగలుగుతున్నామో, ఎలా నిలదొక్కుకోవాలో ఆత్మపరిశీలన చేసుకోవాలని బార్‌కి, మాకు కూడా మా విన్నపం" అని తెలిపారు. "మనం ఓడినా, గెలిచినా పర్వాలేదు, ఆ సంస్థపై మనకున్న విశ్వాసమే ముఖ్యం, అది నెమ్మదిగా సన్నగిల్లుతోంది" అని సిబల్ అన్నారు.

చేసేదొకటి ...చెప్పేదొకటి !

- బాలిలో కార్మిక శాఖ మంత్రి ప్రకటనకు సిఐటియు ఖండన

న్యూఢిల్లీ : ఇండోనేషియాలోని బాలిలో జరిగిన జి-20 సమావేశాల్లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ చేసిన ప్రకటనను సిఐటియు తీవ్రంగా నిరసించింది. మంత్రి చేసిన ప్రకటన కేవలం 'ప్రజా సంబంధాల విన్యాసం'గా వుందని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు. వాస్తవానికి భారత ప్రభుత్వం దీనికి పూర్తిగా భిన్నమైన రీతిలో వ్యవహరిస్తోందని అన్నారు. కోవిడ్ మహమ్మారి నుండి పూర్తిగా, సమర్ధవంతంగా కోలుకోవడానికి గానూ కార్మికుల ఉపాధి పరిస్థితులను మరింత బలోపేతం చేయాల్సి వుందని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. కానీ, భారత్‌లో కోవిడ్ లాక్‌డౌన్ సమయంలోనే లేబర్ కోడ్‌లను రూపొందించారని, ఇన్నేళ్ళుగా కార్మికుల కోసం అమల్లో వున్న కాస్తో కూస్తో ఉపాధి పరిస్థితులన్నీ కూడా దీనితో నాశనమవుతాయని తపన్ సేన్ విమర్శించారు. బీడి కార్మికులు, గని కార్మికులకు ప్రస్తుతం అమల్లో వున్న సెస్ ప్రాతిపదికతో కూడిన సామాజిక భద్రతను కొత్తగా తీసుకు వచ్చిన సామాజిక భద్రతా నిబంధన ముందుగానే నాశనం చేసింది. వారిని దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. ఈ సామాజిక భద్రతా నిబంధన కారణంగా యజమానులు లబ్ది పొందుతుండగా, మరోపక్క పెద్ద సంఖ్యలో కార్మికులు సామాజిక భద్రతా వ్యవస్థ నుండి బయటకు నెట్టబడుతున్నారని సిఐటియు విమర్శించింది. పటిష్టమైన ఉపాధి కల్పనా విధానాలను రూపొందించడం, సామాజిక రక్షణ పెంచడం, నైపుణ్యాల అభివృద్ధి గురించి మంత్రి తన ప్రకటనలో నొక్కి చెబుతున్నారు. కానీ వాస్తవానికి ప్రభుత్వం మాత్రం దానికి పూర్తి విరుద్ధమైన రీతిలో వ్యవహరిస్తోందని తపన్‌సేన్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను మరింతగా అసంఘటితం చేస్తూ ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేయడాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. సామాజిక రక్షణను తొలగిస్తూ, లేబర్ కోడ్‌ల ద్వారా మొత్తంగా క్షీణించే ప్రక్రియను వ్యవస్థీకరించిందని అన్నారు. మంత్రి ప్రకటన, వంచనతో కూడిన ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అనుసరించే ప్రజా సంబంధాల విన్యాసం తప్ప మరొకటి కాదని సిఐటియు తీవ్రంగా విమర్శించింది.

విద్యాసంస్థను నిర్వహించినంత మాత్రాన మైనారిటీ హోదా ఇవ్వలేం ..!

లక్నో : కేవలం మైనారిటీ విద్యా సంస్థను నిర్వహించినంత మాత్రాన ఎంఇఆర్‌ఇ విద్యా సంస్థకు మైనారిటీ హోదాను ఇవ్వలేమని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. చట్టం ప్రకారం.. ఆ విద్యా సంస్థను మైనారిటీ సంఘం స్థాపించాల్సి ఉందని తెలిపింది. ఆ విద్యాసంస్థను మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్‌గా కొనసాగించలేమంటూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు సమర్ధించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు కూడా చట్ట వ్యతిరేకం కాదని పేర్కొంది.

కొందరు ట్రస్ట్ సభ్యులు 2001లో ఓ మెడికల్ కాలేజీని స్థాపించారు. అనంతరం 2015లో ఆ ట్రస్ట్ సభ్యులు బుద్దిజమ్‌లోకి మారినప్పటికీ కాలేజీని కొనసాగించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ హోదా కల్పించేందుకు నిరాకరించడంతో ఆ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు పూర్తి ఫీజును చెల్లించాలంటూ వైద్య విద్యాశాఖ ఆదేశించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ.. తమ విద్యా సంస్థకు మైనారిటీ హోదా కల్పించాలంటూ ఎంటివి బుద్దిజమ్ రెలీజియస్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అలహాబాద్ హైకోర్టులో రిట్ పిటిషన్‌ను దాఖలు చేసింది.ఉత్తరప్రదేశ్ ప్రైవేట్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం 2006 ప్రకారం.. ఒక సంస్థ మైనారిటీ సంస్థగా అర్హత పొందాలంటే ఆ విద్యాసంస్థ కేవలం మైనారిటీలచే నిర్వహించబడే సంస్థ అయి ఉండాలని, మైనారిటీలే స్థాపించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించాలని లక్నో బెంచ్ పేర్కొంది. ఒక సంస్థను స్థాపించడం, నిర్వహించడం రెండు వేర్వేరు సంఘటనలని కోర్టు పేర్కొంది. విద్యాసంస్థను స్థాపించే సమయంలో ట్రస్ట్ సభ్యులు ఎటువంటి మైనారిటీ కమ్యూనిటీకి చెందినవారు కాదు. తర్వాత ఆ ట్రస్ట్ మైనారిటీకి మారినంత మాత్రాన విద్యా సంస్థ చట్టం 2006 ప్రకారం లేదా విద్యా సంస్థ చట్టం 2004 ప్రకారం మైనారిటీ సంస్థగా గుర్తించలేమని హైకోర్టు పేర్కొంది.

గాలి జనార్ధన్‌రెడ్డి కేసుల విచారణలో జాప్యంపై సుప్రీం ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గనుల అక్రమ తవ్వకాలకు సంబంధించి కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) నమోదు చేసిన కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరగపడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రయల్ కోర్టులో 12 ఏళ్ల పాటు విచారణ జాప్యం జరగడం సహించలేమని పేర్కొంది. ఈ జాప్యానికి గల కారణాలను, విచారణ దశపై సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని హైదరాబాద్‌లోని సిబిఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జిని ఆదేశించింది. గనులు ఆక్రమ తవ్వకాలకు సంబంధించి 2000లో జనార్ధన్ రెడ్డితో పాటు మరో 9 మందిపై సిబిఐ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లోనే జనార్ధన్ రెడ్డిని 2011 సెప్టెంబరు 5న సిబిఐ అరెస్టు చేసింది. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని కడప, అనంతపురం జిల్లాలకు వెళ్లవద్దనే షరతులతో సుప్రీంకోర్టు 2015 జనవరి 20న ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఆదేశాలను పాటిస్తున్నందున తనపై ఉన్న బెయిల్ షరతులు సడలించాలంటూ ఆయన 2020లో మరోసారి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తుగా ఆయా జిల్లాల పోలీస్ సూపరింటెండ్లకు తెలియజేసి బళ్లారి, కడప, అనంతపురం వెళ్లవచ్చంటూ గతేడాది ఆగస్టు 19న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే గాలి బెయిల్ రద్దు చేయాలంటూ సిబిఐ సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారితో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ మాధవి దివాన్ వాదనలు వినిపించారు. విచారణ సాగకపోవడానికి కారణాలు ఏమిటో తెలియజేస్తూ హైదరాబాద్ సిబిఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి నుంచి సీల్డ్ కవర్ నివేదిక అందజేయాలని, సిబిఐ దాఖలు చేసిన అఫిడవిట్‌కు పిటిషనర్ రిజాయిండర్ దాఖలు చేయొచ్చని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా అమెరికా ద్రవ్యోల్బణం !

- 9.1 శాతానికి చేరిన సూచీ
- సామాన్యులపై ఎనలేని భారాలు

చికాగో : అమెరికాలో గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేని రీతిలో ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ ఏడాది జూన్‌లో వినియోగదారుల ధరల సూచీ అంతకుముందు ఏడాదితో పోలిస్తే 9.1 శాతం పెరిగింది. 1981 తర్వాత ఇదే అత్యధికంగా వుంది. ఆగస్టు మాసంలో ఈ సూచీ 8.3కి కాస్త తగ్గినా, ఇంకా ఇప్పటికీ దశాబ్దాల కాలంతో పోలిస్తే అధికంగానే వుందని కార్మిక శాఖ తాజా సమాచారం పేర్కొంటోంది. ఇక ఆదాయాల విషయానికి వస్తే, మిచిగన్ యూనివర్శిటీ నిర్వహించిన వినియోగదారుల సర్వేల తాజా డేటా చూసినట్లైతే సగానికి పైగా వినియోగదారులు వచ్చే ఏడాదిలో తమ ఆదాయాలు పెరుగుతాయని భావిస్తున్నప్పటికీ కేవలం 18 శాతం మంది మాత్రమే ద్రవ్యోల్బణాన్ని మించి ఆదాయాల పెరుగుదల వుంటుందని భావిస్తున్నట్లు వెల్లడైంది. "ద్రవ్యోల్బణం బాగా దెబ్బతీస్తోంది. దీనివల్ల

ప్రజలు నిరుద్యోగులవుతున్నారు. ధరలు పెరిగిపోతున్నాయి. తీవ్రమైన ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి." అని చికాగోలోని స్టార్ట్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఖైరీ టార్క్ వ్యాఖ్యానించారు. ఆహరపదార్ధాల ధరలు, ఇంధనం, ఇంటి అద్దె ఇలా అన్నీ పెరిగిపోతుండడంతో ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారని అన్నారు. బాగా సంపన్నులైన ఎగువ 20శాతం ప్రజలు మినహా సమాజంలోని అన్ని వర్గాల వారు ఈ బాధను అనుభవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మధ్య తరగతి వర్గం సంకోచించుకుపోతుందని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఇంటి అద్దె నియంత్రణలను తీసుకురావడం, ఆర్ధిక వ్యవస్థకు ఉద్దీపన కలిగించేలా 1.9 లక్షల కోట్ల డాలర్ల ఆర్ధిక విధానాన్ని రూపొందించడం, విద్యార్ధి రుణాలను మాఫీ చేయడం వంటి అనేక చర్యలు తీసుకున్నా వాటి ప్రభావం పెద్దగా కనిపించడం లేదని అన్నారు. ఈ ద్రవ్యోల్బణం రాబోయే కాలంలో కూడా మనతో కలిసి ప్రయాణం చేసే అవకాశాలే ఎక్కువగా వున్నాయన్నారు. నగదు సరఫరా చాలా వేగంగా పెరిగిపోవడం ఈ ద్రవ్యోల్బణానికి ప్రధాన కారణమని ఆయన పేర్కొంటున్నారు. ఖర్చును పెంచడానికి డబ్బును ముద్రించే యంత్రాలను ఉపయోగించడం చాలా తేలిక. ఈ విధానాల వల్ల మనం చాలా అధిక మూల్యం చెల్లిస్తున్నామని టార్క్ అన్నారు.

కోవిడ్ వ్యాక్సిన్లు కొనుక్కోవాల్సిందే !

అమెరికన్ కాంగ్రెస్ వద్ద దాదాపుగా నిధులు హరించుకుపోయినందువల్ల వచ్చే ఏడాది జనవరి నుండి కోవిడ్ వ్యాక్సిన్లు, చికిత్సలకు అమెరికన్లు నగదు చెల్లించాలని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఇప్పటివరకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న కోవిడ్ వ్యాక్సిన్లు ఇకపై వాణిజ్య అమ్మకాల విభాగంలోకి వెళ్ళిపోతాయని ఆరోగ్య, మానవన సేవల విభాగం ఈ నెల మొదట్లో ప్రకటించింది. బహుశా 2023 జనవరి నుండి ప్రారంభం కావచ్చని తెలిపింది. దీంతో ఇక అమెరికన్లు బీమా సంస్థల ద్వారా వ్యాక్సిన్లు పొందాలి లేదా డబ్బు చెల్లించాల్సి వుంటుంది. ప్రభుత్వ సరఫరా ఆగిపోయిన పక్షంలో ఎలాంటి బీమాలు లేని దాదాపు 8 శాతం జనాభా తీవ్ర ఇబ్బందుల పాలవుతారని వాషింగ్టన్ పోస్ట్ తన నివేదికలో పేర్కొంది. ఒకవేళ ఆరోగ్య బీమా వున్నా కొంత మొత్తం జేబులోంచి ఖర్చు పెట్టక తప్పదు. ఇప్పటికే జీవన వ్యయం పెరిగిపోతున్న వేళ ఇదొక అదనపు సమస్య కానుంది.

రూ.200 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత..

అహ్మదాబాద్ : రూ. 200కోట్ల విలువైన 40 కేజీల హెరాయిన్‌ను గుజరాత్ పోర్ట్‌లో బుధవారం ఉగ్రవాద నిరోధక స్క్వాడ్ (ఎటిఎస్) స్వాధీనం చేసుకుంది. అరేబియన్ సముద్ర తీరంలో ఓ పాకిస్తాన్ ఫిషింగ్ బోట్ నుండి హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఆరుగురు పాకిస్తానీయులను అదుపులోకి తీసుకున్నట్లు ఎటిఎస్ ఉన్నతాధికారి తెలిపారు. గుజరాత్ తీరప్రాంత భద్రతా దళాలు, ఎటిఎస్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు వివరించారు. నిర్దిష్ట సమాచారం మేరకు కచ్ జిల్లాలోని జఖౌ ఓడరేవుకు సమీపంలో హెరాయిన్‌ను తీసుకువెళుతున్న పాకిస్తాన్ ఫిషింగ్ బోటును సముద్రం మధ్యలో అడ్డగించాయని అన్నారు. నిందితులు గుజరాత్ తీరంలో సరుకును దింపి రోడ్డు మార్గం ద్వారా పంజాబ్‌కు తరలించాలని భావించారని అన్నారు. గతంలో కూడా గుజరాత్ తీరంలో మాదక ద్రవ్యాల అక్రమ తరలింపును అడ్డుకున్నామని చెప్పారు.

జైల్లోనే జర్నలిస్ట్ సిద్దీఖీ కప్పన్

లక్నో : కేరళ జర్నలిస్ట్ సిద్దీఖీ కప్పన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ లభించినప్పటికీ.. యుపి ప్రభుత్వం ఆయనను విడుదల చేయలేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కేసు విచారణలో ఉండటంతో సిద్దీఖీని విడుదల చేయలేదని జైలు అధికారి తెలిపారు. 'ఇడి విచారిస్తున్న కేసు ఇంకా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కప్పన్ జైలు నుంచి విడుదల చేయడం లేదు' అని జైళ్ల పిఆర్‌ఓ డిజి సంతోష్ వర్మ వెల్లడించారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఈనెల 9వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సిద్దీఖీని మూడు రోజుల్లోగా ట్రయల్ కోర్టులో హాజరుపర్చి.. బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

సభ్య దేశాల మధ్య సంఘీభావం అవశ్యం !

- ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ పిలుపు
- 77వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

ఐక్యరాజ్య సమితి : ఉమ్మడి సవాళ్ళను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు సంఘీభావంతో వ్యవహరించాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పిలుపిచ్చారు. మంగళవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 77వ సమావేశాలు ప్రారంభమయ్యాయని జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కసాబా కొరొసి ప్రకటించారు. కొత్త సమావేశాలు ప్రారంభమైనా గత సమావేశాల్లో పేర్కొన్న అనేక సవాళ్ళు ఇంకా అపరిష్కృతంగానే వున్నాయని గుటెరస్ పేర్కొన్నారు. ఘర్షణలు, వాతావరణ మార్పు, చిన్నాభిన్నమైన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, దారిద్ర్యం, అసమానతలు, ఆకలి, అవిశ్వాసం వంటి పరిస్థితుల నుండి శాంతి, మానవ హక్కులు, సుస్థిర అభివృద్ధి దిశగా మనం ముందడుగు వేయాలని, అనేక సంక్షోభాలతో సతమతమవుతున్నామని సంక్షోభంతో నిండిన ప్రపంచంలో మనం వున్నామని గుటెరస్ పేర్కొన్నారు. ఈ ఉమ్మడి సవాళ్ళను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు మనమంతా సంఘీభావంగా వ్యవహరించాల్సి వుందని, ఈ క్రమంలో ఈ సంస్థ యొక్క పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాల్సి వుందని అన్నారు. ఐక్యరాజ్య సమితి అంటేనే సహకారానికి కేంద్ర బిందువు. అందులో జనరల్ అసెంబ్లీ అనేది జీవనాడి వంటిది. ఈ సంస్థ దేనికైతే ప్రాతినిధ్యం వహిస్తోందో ఆ బహుళపక్ష వ్యవస్థ పటిష్టతకు, శాశ్వతత్వానికి రాబోయే రోజులు పరీక్షగా నిలుస్తాయని ప్రతినిధులను ఉద్దేశించి గుటెరస్ పేర్కొన్నారు. చర్చలు, సంప్రదింపులు, దౌత్యం ఈ మూడు సమర్ధవంతమైన సాధనాలను ఉపయోగించుకుని సమస్యలకు పరిష్కారాలను, ఏకాభిప్రాయాలను కనుగొనాల్సిన బాధ్యత మన సభ్య దేశాలపై వుందని, యావత్ ప్రపంచం ఈ విషయంలో మన వైపే చూస్తోందని గుటెరస్ పేర్కొన్నారు. మరింత మెరుగైన, శాంతియుతమైన ప్రపంచం దిశగా ఇదే అత్యుత్తమమైన మార్గమని వ్యాఖ్యానించారు. సంఘీభావం, సుస్థిరత, సైన్స్ ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు కొరొసి పిలుపిచ్చారు. మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి ఏకైక మార్గం మనం పరివర్తన చెందడమేనని అన్నారు. ఈ పరివర్తనకు అవసరమైనవేంటో మనకు ఇప్పటికే తెలుసునని అన్నారు. వాటిని అమల్లో పెట్టడమే మనం ఇప్పుడు చేయాల్సిందని అన్నారు.

నేడు షాంఘై సదస్సు

సమర్కండ్ (ఉజ్బెకిస్తాన్) : షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు ఉజ్బెకిస్తాన్‌లోని సమర్కండ్‌లో గురువారం ప్రారంభమవుతోంది. కోవిడ్ తర్వాత పూర్తి స్థాయిలో జరుగుతున్న మొదటి ముఖాముఖి సమావేశం ఇదే. 2019లో కిర్గిస్తాన్‌లోని బిష్‌కెక్‌లో చివరిగా సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఎస్‌సిఒ సభ్య దేశాలైన భారత్, చైనా, కజకస్తాన్, కిర్గిస్తాన్, పాకిస్తాన్, రష్యా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల అధినేతలు పాల్గొంటున్నారు. ఇప్పటివరకు పరిశీలకురాలి హోదాలో వున్న ఇరాన్ ఈసారి సభ్య దేశంగా చేరుతోంది. మోడీ, పుతిన్, జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసితో సహా మొత్తంగా 15మంది నేతలను సదస్సుకు ఆహ్వానించారు.

షాంఘై సహకార సంస్థను 2001లో రష్యా, చైనా, కిర్గిజ్ రిపబ్లిక్, కజికిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లు షాంఘై నగరంలో స్థాపించాయి. ప్రాంతీయ భద్రతా సమస్యలు, అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించే ఈ సంస్థలో 2005లో భారత్ పరిశీలకురాలిగా చేరింది. 2017లో పాకిస్తాన్‌తో కలిసి భారత్ సభ్యత్వం పొందింది. రష్యా యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో నెలకొన్న పరిస్థితిపై సదస్సులో ప్రధాన చర్చించనున్నారు. అలాగే ఉక్రెయిన్‌పై దాడి తర్వాత అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షుభిత పరిస్థితులను కూడా చర్చిస్తారని భావిస్తున్నారు. అలాగే తాలిబన్లు పగ్గాలు చేపట్టిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లోని పరిస్థితి కూడా ఎజెండాలో ముఖ్యాంశంగా వుంది. ఈ సదస్సుకు హాజరయ్యే నేతలు పలువురు ఈ సందర్భంగా ముఖాముఖి సమావేశాలు జరపనున్నారు. ఎస్‌సిఒ సదస్సు సందర్భంగా జరిగే పలు సెషన్లలో కనీసం రెండు సెషన్లలో మోడీ, జిన్‌పింగ్‌లు ఒకే రూమ్‌లో వుండనున్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సమావేశం జరిపే అవకాశం వుందని భావిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా మోడీ భేటీ అయ్యే అవకాశం వుంది.

జిన్‌పింగ్‌కు సాదర స్వాగతం

కజకస్తాన్‌లో ఒక రోజు అధికార పర్యటన నిమిత్తం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం ఇక్కడకు చేరుకున్నారు. ఉజ్బెకిస్తాన్‌లో జరిగే ఎస్‌సిఒ సదస్సుకు హాజరవుతున్న జిన్‌పింగ్ ఈ సందర్భంగా కజక్, ఉజ్బెక్ అధ్యక్షుల ఆహ్వానం మేరకు ఆయా దేశాల్లో అధికార పర్యటన జరుపుతున్నారు.

ICICI Home Finance | **కార్పోరేట్ కార్యాలయం:** ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, అంధేరి -కుర్లా రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా

శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి, డా॥ ఎన్.వి. రమేష్ కాంప్లెక్స్, 13-1, 54, మెయిన్ రోడ్డు, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001.
శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, డా॥ ఎన్.వి. రమేష్ కాంప్లెక్స్, 13-1, 54, మెయిన్ రోడ్డు, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533001.

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]

స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖాపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/హామీదారులు/ చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	చెరుకూరి వి రావు (రుణగ్రహీత), చెరుకూరి అనురాధ (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. NHKKN00001269153	ఎస్.నం. 890 పి, ప్లాట్ నం. 85, శ్రీ వెంకట అనూషా క్రూసిబుల్స్ ఇండస్ట్రీస్, ఎపిఐఐసి లిమిటెడ్ లాల పెద్దాపురం గ్రామం, పెద్దాపురం మండలం, తూర్పు గోదావరి జిల్లా, పిన్‌కోడ్: 533437	Rs. 56,60,941/- 09th Sept, 2022	Rs. 1,44,04, 950/- / Rs. 14,40, 495/-	23rd Sept, 2022 11:00 AM 03:00 PM	30th Sept, 2022 02:00 PM 03:00 PM
2.	గణేష్ తులసీరామ్ గుప్తా ఎర్రమిల్లి (రుణగ్రహీత), పబోలు (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. NHKKN00001267561	డో.నం. 21-1-53 ఎదురు, టి.ఎస్.నం. 90, మున్సిపల్ వార్డు నం.14, బ్లాక్ నం.20, పాత పట్టా నం.10-4614, కొత్త పట్టా నం. 1060029620, ఉంగరాలవారి వీధి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, తూర్పు గోదావరి జిల్లా, పిన్ కోడ్-533001.	Rs. 1,29,14, 821/- 09th Sept, 2022	Rs. 1,05,30, 000/- / Rs. 10,53, 000/-	23rd Sept, 2022 11:00 AM 03:00 PM	30th Sept, 2022 02:00 PM 03:00 PM
3.	మంగమణి పబోలు (రుణగ్రహీత), గణేష్ తులసీరామ్ గుప్తా ఎర్రమిల్లి (సహ రుణగ్రహీత) లోన్ ఖాతా నం.: NHKKN00001267563	డో.నం. 21-1-53 ఎదురు, టి.ఎస్.నం. 90, మున్సిపల్ వార్డు నం.14, బ్లాక్ నం.20, పాత పట్టా నం.10-4614, కొత్త పట్టా నం. 1060029620, ఉంగరాలవారి వీధి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, తూర్పు గోదావరి జిల్లా, పిన్ కోడ్-533001.	Rs. 1,26,50, 069/- 09th Sept, 2022	Rs. 1,05,30, 000/- / Rs. 10,53, 000/-	23rd Sept, 2022 11:00 AM 03:00 PM	30th Sept, 2022 02:00 PM 03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్ వెబ్‌సైట్ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 29 సెప్టెంబర్, 2022న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖాదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్న్ ఇ చూచుట) డో.నం. 21-1-53 ఎదురు, టి.ఎస్.నం. 90, మున్సిపల్ వార్డు నం.14, బ్లాక్ నం.20, పాత పట్టా నం.10-4614, కొత్త పట్టా నం. 1060029620, ఉంగరాలవారి వీధి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, తూర్పు గోదావరి జిల్లా, పిన్ కోడ్-533001 లేదా 29 సెప్టెంబర్, 2022న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్ల యొక్క సంతకంచేసిన కాపీ డో.నం. 21-1-53 ఎదురు, టి.ఎస్.నం. 90, మున్సిపల్ వార్డు నం.14, బ్లాక్ నం.20, పాత పట్టా నం.10-4614, కొత్త పట్టా నం. 1060029620, ఉంగరాలవారి వీధి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, తూర్పు గోదావరి జిల్లా, పిన్ కోడ్-533001 లేదా 29 సెప్టెంబర్, 2022న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి తూర్పు గోదావరి వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ లేదా సేల్స్ అండ్ మార్కెటింగ్ పార్ట్నర్ నెక్స్‌జెన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరణాత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి.

తేది: 15 సెప్టెంబర్, 2022
ప్రదేశం: తూర్పు గోదావరి.

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్